
ప్రజాశక్తి
ఆదివారం 10 ఆగస్టు 2025
5
విజయనగరం



ఊరటనిచ్చిన వర్షం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాం, తలగాం, యయి. సీతారాం పురం, మద్దివలస, గీతనాపల్లి తదితర గ్రామాలలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ప్రస్తుతం వర్షాకాల సీజన్ అయినప్పటికీ గత కొన్నాళ్లుగా వర్షం కురవకపోవడం, ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.మరోవైపు వరి నారు మళ్లు ఎండిపోతున్నాయి. తోటపల్లి కాలువ శివార ఆయకట్టు అయిన వంగర మండలంలో గల భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు కూడా ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఈనేపథ్యంలో కురిసిన వర్షం కొంత ఊరట ఇచ్చింది.



వంగరలో కురుస్తున్న వర్షం



రిజర్వాయరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 23 ఏళ్ల క్రితం నిర్మించిన మడ్డువలస ప్రాజెక్టు అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాలువలు మరమ్మతులకు గురికావడంతో సాగునీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. కాలువల ఆధునీకరణ పనులకు నోచుకోకపోవడంతో సాగు భూములకు సక్రమంగా నీరు అందడం లేదు. ప్రధాన గేట్లు మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ కొన్ని పనులు చేశారు మిగతా పనులు ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

- ఆధునీకరణ పనులు చేయకపోవడంతో అధ్వానంగా కుడి, ఎడమ కాలువలు
- గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరైనా అర్ధాంతరంగా నిలిచిన పనులు
- మిగతావి ఎప్పుడు చేస్తారో తెలియని పరిస్థితి
- గుర్రపు డెక్కలతో మరింత ఇబ్బంది
- రాత్రివేళ అంధకారంలోనే ప్రాజెక్టు

అభివృద్ధికి నోచని మడ్డువలస

ప్రజాశక్తి- వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములనాయుడు మడ్డువలస ప్రాజెక్టు నుండి స్టేజ్ 1లో జిల్లాలోని వంగర మండలంలో 996 ఎకరాలకు, రేగిడి మండలంలో 6,777 ఎకరాలకు, సంతకవిటి మండలంలో 10,976 ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో 6,029 ఎకరాలకు, పొందూరులో 99 ఎకరాలకు, మొత్తం 24, 877 ఎకరాలకు, స్టేజ్ 2లో శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలో 536 ఎకరాలకు, పొందూరు మండలంలో 5,173 ఎకరాలకు, లావేరు మండలంలో 5,474 ఎకరాలకు, ఎచ్చెర్లలో 1,317 ఎకరాలకు మొత్తం 12,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే ఇంత పెద్ద ప్రాజెక్టుకు సంబంధించిన కుడి, ఎడమ కాలువల గట్లు దశబ్దాలు గడిచినా ఆధునీకరణ పనులు చేయకపోవడంతో చాలా బలహీనంగా ఉన్నాయి. ఎడమ ప్రధాన కాలువ నుంచి ఈ ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న వంగర మండలంలోని మగ్గూరు, ఓని ఆగ్రహారం, సంగాం గ్రామాల పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే కాలువలు అధ్వానంగా ఉండడంతో ఏటా రైతులకు సాగునీటి కోసం అవస్థలు తప్పడం లేదు. కాలువ ద్వారా సాగు నీరు విడిచిపెట్టినప్పటికీ వృధాగా పోతోంది తప్ప శివారు భూములకు అందడం లేదు. కుడి ప్రధాన కాలువకు సంబంధించి కాలువలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. ఇటీవల అధికారులు కుడి, ఎడమ కాలువల్లో అక్కడక్కడ పూడిక తీత పనులు చేశారే తప్ప పూర్తిస్థాయిలో గట్టి పనులు చేయకపోవడం వల్ల శివారు ఉన్న ఎచ్చెర్ల, లావేరు మండలాలకు పూర్తిస్థాయిలో ఇప్పటికీ సాగు నీరందకపోవడంతో అవస్థలు పడుతున్నారు.



మడ్డువలస రిజర్వాయరు



పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

ఆధునీకరణకు నోచని వైనం

ప్రాజెక్టుకు ఉన్న 11 ప్రధాన గేట్లు మరమ్మతులకు గురి కావడంతో వీటిని బాగు చేసేందుకు, పెయింటింగ్, లైట్లు తదితర వాటికి 2023లో రూ.1.80 కోట్లు నిధులు మంజూరు కావడంతో మరమ్మత్తు పనులు కొంతమేర చేశారు. ఇంకా కొన్ని పనులు అర్ధాంతరంగానే మిగిలిపోయాయి. రెండేళ్లు గడిచినా ఇంతవరకు మిగిలిన పనులు పూర్తి చేయలేదు. వీటికి సంబంధించిన నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు ఉన్నాయి.

రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రాజెక్టు వద్ద ప్రధాన రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. ఏళ్ల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో అక్కడికి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఇంత పెద్ద ప్రాజెక్టు వద్ద రాత్రి వేళల్లో లైట్లు లేక అంధకారంలో ఉంటోంది. కనీసం లైట్లు కూడా వేయటానికి చర్యలు చేపట్టటం లేదు. వరదల సమయంలో రాత్రి వేళల్లో గేట్లు ఎత్తాలన్నా, దించాలన్నా సిబ్బంది చాలా ఇబ్బంది పడుతున్నారు.

పేరుకుపోయిన గుర్రపు డెక్క

ప్రాజెక్టులో గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయింది. ఇది కుడి, ఎడమ కాలువల సాగునీటి ద్వారా ఆయకట్టు భూముల్లోకి వెళ్ళిపోతుండటంతో సాగుకి ఆటంకం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. దీనివల్ల ప్రాజెక్టులో చేప వేటకుకూడా తీవ్ర ఆటంకం జరుగుతుంది. మత్స్యకారులు వేట సమయంలో ఈ గుర్రపు డెక్కలో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. అధికారులు మాత్రం గుర్రపు డెక్కను తొలగించేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టటం లేదు.

ప్రాజెక్టులో ప్రస్తుత నీటి పరిస్థితి

ప్రాజెక్టు పూర్తిస్థాయి లెవెల్ నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 64.40 మీటర్లు లెవెల్ నీటిమట్టం ఉందని ప్రాజెక్టు ఎఇ కె.నితిన్ తెలిపారు. సువర్ణా ముఖి, వేగావతి నదుల నుండి 1096 క్యూ సెక్కుల నీరు వచ్చి చేరుతుందని అన్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా 710 క్యూ సెక్కుల నీరు దిగువ ఆయకట్టుకు వెళుందన్నారు.

బిల్లులు అందకే పనులు పెండింగ్

మరమ్మతులకు నిధులు మంజూరైన తర్వాత సుమారు 80 శాతం వరకు పనులు పూర్తి చేసాం. కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడం వల్ల మిగతా పనులు చేయలేదు. ఇంకా 15 లక్షల రూపాయలు మాత్రమే నిధులు ఉన్నాయి. బిల్లులు అయితే మిగతా పని చేస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నారు. కాలువలలో అక్కడక్కడ పూడిక తీత పనులు చేపట్టాం.

- పి. అర్జున్, ప్రాజెక్టు డిఇ



నిరసన తెలుపుతున్న కవులు, సాహితీవేత్తలు, అభ్యుదయ వాదులు

పుస్తకాలపై నిషేధం..

భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమే

నిరసనలో అభ్యుదయ వాదులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జమ్మూ కాశ్మీర్ చరిత్ర, సమస్యలపై చర్చించే 25 పుస్తకాల మీద అక్కడి లెఫ్టినెంట్ గవర్నరు మనోజ్ సిన్హా నిషేధం విధించటం రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛను హరించడమేనని పలువురు కవులు, రచయితలు, అభ్యుదయ వాదులు పేర్కొన్నారు. పుస్తకాల నిషేధాన్ని వ్యతిరేకిస్తూ శనివారం జిల్లా కేంద్ర గురజాడ గ్రంథాలయం వద్ద భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ మాట్లాడుతూ తమకు నచ్చని అభిప్రాయాలు, సంఘటనలూ చరిత్రలో కనపడకూడదని, సంభాషణల్లో వినపడకూడదని భావించే నిరంకుశ ధోరణికి పరాకాష్ట కాశ్మీర్ గవర్నర్ నిర్ణయమని అన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని పేర్కొన్నారు. కాశ్మీర్ చరిత్ర పుస్తకాలు బయటకు వస్తే భయపడ్డారు ఏమో గాని ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని అన్నారు.ఈ నిర్ణయం రచయితలను, మేధావులను విస్మయానికి గురి చేసిందన్నారు.

పలువురు అభ్యుదయ వాదులు మాట్లాడుతూ చాలాకాలం క్రితం ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీలో కమ్యూనిస్టు సాహిత్యాన్ని అధికారులు దాచేసే ప్రయత్నం చేయటాన్ని ఎద్దేవా చేస్తూ ప్రముఖ పరిశోధకుడు ఆరుద్ర 'సన్నికాలు దాచేస్తే పెళ్లాగిపోతుందా?' అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అదే విశ్వ విద్యాలయ ప్రాంగణంలోనే అబ్బూరి రామకృష్ణారావు అందించిన అభ్యుదయ రచయితల మేనిఫెస్టో చదివే శ్రీశ్రీ అరుణారుణ కిరణాల ఆగమనాన్ని ఆహ్వానిస్తూ 'మహా ప్రస్థానం' గీతాలు రాశాడని తెలిపారు. దాచేస్తే, నిషేధిస్తే చరిత్ర నిరంకుశ పునాదుల కింద అణిగిపోదు. ఆగిపోదని అన్నారు. పుస్తకాల్లోని మంచిచెడ్డలను గ్రహించటం, తమకున్న జ్ఞానంతో బేరీజు వేసుకోవటం పాఠకుల పని అని, ప్రజలకు నచ్చితే పుస్తకం వర్ధిల్లుతుందని, ఒప్పకపోతే మూలకు చేరుతుందని అన్నారు. ఆయా పుస్తకాల్లోని చరిత్రపైనో, సంఘటనలపైనో అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఉంటే ఎవరైనా వ్యక్తం చేయొచ్చని, ఇదంతా ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన ప్రక్రియని తెలిపారు. కాశ్మీర్ ప్రజల అభిప్రాయాలకు, ఆకాంక్షలకు వీసమెత్తు విలువ కూడా ఇవ్వకుండా ఆరేళ్ల క్రితం రాష్ట్ర హోదాను తెగనరికిన మోడీ సర్కారు ఇప్పటికీ అదే ధోరణిని కొనసాగిస్తోందన్నారు. మోడీ తొలి మంత్రివర్గంలో రైల్వే శాఖ సహాయమంత్రిగా, తరువాత సమాచార శాఖ మంత్రిగా పనిచేసిన మనోజ్ సిన్హా జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ గాఉన్నారని, బిజెపి అజెండాకు అనుగుణంగా తరచూ నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని అన్నారు. ఎజి నూరాని, అరుంధతీరారు, అనురాధా బాసిన్, సుమత్రా బోస్ వంటి ప్రఖ్యాత రచయితల పుస్తకాలను ఈ నిషేధిత జాబితాలో పెట్టడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. సాహిత్య సాంస్కృతిక కళారంగాల మీద, పత్రికలూ పుస్తకాల మీదా నిషేధాలూ, నియంత్రణలు విధించటం బ్రిటీషు కాలంలో ఎక్కువగా సాగిందని, మళ్లీ బిజెపి ఆధ్వర్యాన బ్రిటీష్‌పాలన సాగుతోందని విమర్శించారు. లెఫ్టినెంట్ గవర్నరు తన అర్థరహిత చర్యను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎం.వి.ఎస్. వెంకట రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమన్ ప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్‌రావు, గురజాడ అధ్యయన వేదిక కన్వీనర్ కె.శ్రీనివాసరావు, వి.రాజ్ గోపాల్, ఎం.కృష్ణమూర్తి, రొంగలి పోతన్న, రెడ్డి శంకర్రావు, బాలకృష్ణ, జె.బంగారం తదితరులు పాల్గొన్నారు



ఆకులు చుట్టుకుని నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

ఆదివాసీ దినోత్సవాన

ఆకులు చుట్టుకొని నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పేరుతో ఒకవైపు ప్రభుత్వం సంబరాలు చేస్తోంది. మరోవైపు అదే ఆదివాసీలు జిందాల్ చేసిన మోసానికి బలై సర్వం కోల్పోయి 50 రోజులుగా రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సి వస్తోంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిందాల్ పరిశ్రమకు భూములిచ్చిన నిర్వాసిత గిరిజనులు ఆకులు చుట్టుకుని శనివారం బొడ్డవరలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సిహెచ్ జగన్ మాట్లాడుతూ గిరిజన సమస్యలు పరిష్కరించ కుండా ఆదివాసీ సంబరాలు చేసుకోవడం దారుణమన్నారు. 2006-08 మధ్య కాలంలో ప్రభుత్వం ఇచ్చిన డి-పట్టా భూమి మొత్తాన్ని జిందాల్ మాటలకు మోసపోయి అప్పగిస్తే కంపెనీ కట్టకుండా, ఎటువంటి ఉపాధి కల్పించకుండా కార్పొరేట్ ఆలోచనలతో ఇండస్ట్రియల్ రియల్ ఎస్టేట్‌కు పూనుకుందని విమర్శించారు. ఆరోజు జరిగిన ఒప్పందం ప్రకారం కంపెనీ గానీ, ఉద్యోగం గానీ, కంపెనీలో వాటా గానీ లేకుండా చేసి, తీసుకున్న భూమిని అమ్మకానికి పెడుతుంటే గిరిజనులకు దిక్కేమిటని ప్రశ్నించారు. భూములు కోల్పోయిన గిరిజనులు రోడ్డు పక్కనే ఆందోళన చేస్తుంటే వారిని పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ దినోత్సవం జరుపుకునేందుకు ఎలా అర్హులు అవుతారని ప్రశ్నించారు. తక్షణమే జిందాల్ నిర్వాసిత గిరిజనులకు మేలు చేసేందుకు ప్రయత్నించాలని డిమాండ్‌చేశారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి- కంటోన్మెంట్

ఆదివాసీలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గిరిజన ప్రాంతాలకు రహదారుల అభివృద్ధికి 10 కోట్ల అంచనా వ్యయం తో ప్రతిపాదనలు ఇప్పటికే పంపించామని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రికి గిరిజన సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జిల్లా విడిపోయిన తర్వాత ఐటిడిఎ మన జిల్లా నుండి వేరయ్యిందని, అందువలన గిరిజనులకు అందాల్సిన సౌకర్యాలను కోల్పోయారని, విడిపోవడం వలన ఏమేమి కోల్పోయారో వాటినాన్నిటిని జిల్లాలో ఉన్న 36గ్రామాలకు సమకూరుస్తామని తెలిపారు. ఖాళీగా ఉన్న ఎఎన్ఎం పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెగ్యులర్ గా శాఖద్వారా సమీక్షలు జరిపి గిరిజన సమస్యలను తెలుసుకోవాలని, తద్వారా పరిష్కారానికి కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారికి మంత్రి సూచించారు.

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. గిరిజనుల నుండి ఐఎఎస్., ఐపిఎస్‌లు రావాలని, అప్పుడే వారు ఆర్థికంగా అభివృద్ధి చెందగలరని తెలిపారు. గిరిజన కలలను, వారసత్వ సంపదను, సంస్కృతిని ముందుకు తీసుకు వెళ్లాలని , అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు తుమ్మ అప్పలరాజు, దుక్క సీతారాము, గేదెల లక్ష్మణరావు, నాగమణి, లక్ష్మి నారాయణ తదితరులు గిరిజన సమస్యలపై ప్రసంగించారు. అనంతరం గిరిజన నాయకులను మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయం పై ప్రత్యేకంగా ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

శృంగవరపుకోట : మండలంలోని పలు గిరిజన గ్రామాలలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్లిపూడి, రేగపుణ్యగిరి, దబ్బగుంట గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు రక్షణగా ఉన్న హక్కులను, చట్టాలను సమూలంగా మార్పులు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గిరిజన గ్రామాలకు స్వతంత్ర ఫలాలు అందని ద్రాక్షలా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కనీస సౌకర్యాలు సైతం కల్పించడం లేదని వాపోయారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగ నియామకాలు గిరిజనులతో చేపట్టాలని కోరారు. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాల భూమి పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మహేష్, శ్రీను, రాజు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట.. జెండావిష్కరణలో పాల్గొన్న గిరిజనులు



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

12న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, తోటపాలెం ఎస్ఎస్ఎస్ఎస్ డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో ఈనెల 12న కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35ఏళ్ల మధ్య వయసుగల వారు ఉదయం 9గంటలకు జరిగే ఎంపికలకు హాజరు కావచ్చునని తెలిపారు. జాబుమేళా కు 16 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అబ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు తో పాటుగా రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌పోర్టు సైజ్‌ఫొటోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 7995691295, 9988853335 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

కూలిన ట్యాంకు దిమ్మె

నాణ్యతా లోపంగా జెజెఎం పనులు



కూలిపోయిన ట్యాంకు దిమ్మె

ప్రజాశక్తి-వేపాడ

జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన పనుల్లో నాణ్యతా లోపం వల్ల మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. గిరిజనులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటుచేసిన ట్యాంకు దిమ్మె కూలిపోయింది. మండలంలోని వావిలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన కడకండలో ఇటీవల కాలంలో జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు సరఫరాకు ఒక ట్యాంకు ఏర్పాటు చేసేందుకు దిమ్మె కట్టారు. దానిపై ట్యాంకు ఏర్పాటుచేసి, అక్కడి నుండి ప్రతి ఇంటికీ కొళాయిలు బిగించారు. పనులు పూర్తి కాకపోవడంతో తాగునీరు సరఫరా కాలేదు. ఈ తాగునీటి ట్యాంకును చెరువు గట్టుపై సిమెంటు ఇటుకలతో నాణ్యతా లోపంగా బిగించారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ట్యాంకు దిమ్మె జారిపోయి పక్కనే ఉన్న కోనేరులో పడిపోయింది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ చేసిన పనిలో నాణ్యత ఎంత లోపంగా ఉందో బట్టబయలు అయిందని గిరిజనులు అంటున్నారు. పనులు పూర్తికాకముందే ట్యాంక్ పడిపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను ఏ విధంగా చేయిస్తున్నారో అర్థమవుతుందని చెబుతున్నారు. ట్యాంకు చెరువుగట్టుపై నిర్మించినప్పుడే గ్రామస్తులు వద్దన్నా వినిపించుకోకుండా నిర్మించడంతో ఇలా జరిగిందని అంటున్నారు. ఇప్పటికైనా జెజెఎం పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ నాణ్యతతో చేపట్టాలని కోరుతున్నారు.

ఈ విషయాన్ని కాంట్రాక్టర్ సతీష్ దృష్టికి తీసుకెళ్లగా, కడకొండలో మళ్లీ దిమ్మె ఏర్పాటుచేసి, ట్యాంకు బిగిస్తామని చెప్పారు. ఇంకా ఈ పనులకు సంబంధించి బిల్లు కూడా మంజూరు కాలేదన్నారు.

కనీస వేతనాలపై చిత్తశుద్ధి ఏది?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓవైపు పెరుగుతున్న ధరలు... ఇంకోవైపు తాండవిస్తున్న నిరుద్యోగం... ఇటువంటి పరిస్థితుల్లో దొరికిన పనైనా చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొద్దామనుకున్న వారికి అత్తెసరు కూలి. కనీస వేతనాలన్న మాటే తప్ప, దాని అమలుకు పూనుకోకపోవడమే ఇందుకు తార్కాణమంటూ పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. ఒప్పంద కార్మికులకు (కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు) కనీస వేతనాలు అమలు చేయాలంటూ జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కనీస వేతన కమిటీ చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించిన సంగతి విధితమే. గ్రామీణ ప్రాంతంలోని అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.510, పట్టణ ప్రాంతాల్లో రూ.910 చొప్పున కనీస వేతనం అమలు చేయాలని కూడా స్పష్టం చేశారు. కానీ, ఆచరణలో ఇదెక్కడా అమలు కాకపోవడం గమనార్హం. ప్రైవేటు రంగంలో మాత్రమే కాదు సుమా..! ప్రభుత్వ రంగంలో అమలుకు నోచుకోలేదు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, పార్వతీపురం, పాలకొండ తదితర పట్టణ ప్రాంతాల్లో క్లాత్స్ మర్చెంట్స్ దుకాణాలు, సిఎంఆర్, సౌత్ ఇండియా, చెన్నైయ్ షాపింగ్ మాల్స్ సహా ఎన్నో మాల్స్, బంగారపు షోరూంలు, దుకాణాల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 90శాతం మందికి నెలవారీ వేతనం కేవలం రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే. మరీ



సీనియర్లకు రూ.20 వేలు లోపే ఉంటోంది. అసలే మన జిల్లాలో పరిశ్రమలు తక్కువ. వాటిలో 20ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులకు రూ.20వేలు వేతనం అందడం గగనం. పూసపాటిరేగ ప్రాంతంలోని మైలాన్, హెచ్‌బిఎల్, సిపి ఆక్వా తదితర కంపెనీల్లో ఎక్కడా ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అమలుకు నోచుకోలేదు. రోజువారీ వేతనం రూ.300 నుంచి రూ.రూ.700 లోపే ఉంటోంది. చివరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కూడా రోజువారీ వేతనం రూ.6వేలకు మించి లేదు. చివరకు పింఛను ఎగ్గొట్టడం కోసం ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తున్న అంగన్‌వాడీ ఆయాలు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లది కూడా అదే పరిస్థితి. ఈనేపథ్యంలో జిల్లా తలసరి ఆదాయం కూడా తక్కువలో తక్కువగా రూ.1.54లక్షలు మాత్రమే. వాస్తవానికి కార్మికులకు కనీస వేతనం అమలు జరిగితే తలసరి ఆదాయం రూ.3.32లక్షలకు చేరుతుంది. ఈనేపథ్యంలో పని కల్పించకుండా, పని దొరికన చోట పనికి తగ్గవేతనం లేదా కనీస వేతనాలు అమలు చేయకుండా సగటు వ్యక్తి లేదా కుటుంబం కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుంది? అనేది ప్రభుత్వానికే ఎరుక. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, డీజిల్ పెట్రోల్, ఇతర అవసరాలు తీర్చుకోవడం కార్మికులకు కష్టంగా మారింది. దీనికితోడు స్కూల్ ఫీజులు, మెడికల్ అవసరాలు తలకు మించిన భారంగా పరిణమిస్తున్నాయని జనం నుంచి ఆవేదన వ్యక్తమౌతునే ఉంది.



రక్షాబంధన్ సందర్భంగా చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఐటిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షురాలు విమలారాణి శనివారం రాఖీ కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఘనంగా రక్షాబంధన్

ధర్మస్థల ఘటనపై సిబిఐ విచారణ చేపట్టాలి ● ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ సమీరా



విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుకు రాఖీ కడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌ఎఫ్‌ఐ విజయనగరం గర్ల్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కాంప్లెక్స్ వద్ద రక్షాబంధన్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ సమయానికి రక్షాబంధన్ తేదీ వస్తుంది గాని గాంధీ చెప్పినట్టు అర్ధరాత్రి ఆడపిల్ల తిరిగే రోజు మాత్రం రావడం లేదని విమర్శించారు, పాలకవర్గాలు 75 ఏళ్లుగా స్త్రీలకు రక్షణ కల్పిస్తున్నామని చెబుతున్నా వారు తీసుకొచ్చిన దిశ, నిర్భయ వంటి చట్టాలు కాగితాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని దుయ్యబట్టారు. దేశంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక అమ్మాయి అత్యాచారానికి గురవుతోందని, ఈ కేసుల్లో ముద్దాయిలుగా అత్యధిక శాతం రాజకీయ నాయకులు, అధికారులే ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానంగా దేశం మొత్తాన్ని కుదిపేసిన ధర్మస్థల ఘోరంపై ప్రధానమంత్రి మోడీ, హోం మంత్రి అమిత్‌షా మౌనం వహించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే ధర్మసలలి అంశంపై సిబిఐ విచారణ జరిపించాలని, అత్యాచారానికి గురై పాతి పెట్టబడిన 400 మందికి పైగా మహిళల ఆచూకీ కనుగొని వారిని ఎంతటి దారుణ స్థితికి తీసుకువచ్చిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో సోదరా భావాన్ని పెంపొందించుకునేలా ఆడబిడ్డలకు అండగా నిలవాలనే దృక్పథంతో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఏటా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జె.రవికుమార్, పి.రమేష్,మ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, నాయకులు యర్రమ్మ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, మహిళల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. సమాజంలో స్త్రీలు సురక్షితంగా ఉండే వాతావరణం కల్పించాలని, కుటుంబం, సమాజం అంతటా ఐక్యత, ప్రేమ కలిగి ఉండాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ కోరారు. అనంతరం సిఐ నారాయణమూర్తి, ఎస్ఐ చంద్రశేఖర్‌కు గిరిజన కళాశాల వసతిగృహ విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యులు మణి, రత్న, చిన్న, తిలక్, కిరణ్, గౌరీ శంకర్, శంకర్, మహేష్, టి.మహేష్, సాయి, చైతన్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట సిఐకి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

ఉత్సాహంగా చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం శ్రీ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుజాతా కాలేజిలో ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్ శనివారం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షులు బి.ఎ.రావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సిఐ మంగళవేణి హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 80 మంది చెస్ ఆటగాళ్లు ఈ పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ర్యాపిడ్ లో ప్రథమ స్థానం పర్వేశ అక్కివరపు, ద్వితీయ స్థానం కృష్ణ సాయి సూరజ్, బ్లిట్జ్ లో ప్రథమ స్థానం అక్కివరపు. పరవేష , ద్వితీయ స్థానంలో చంద్ర మౌళి విజేతలు గా నిలిచారు. వీరికి ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

వేతనాలు పెంచాలని 18న విఆర్‌ఎల ధర్నాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సమస్యల పరిష్కారానికి ఈనెల 18న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (విఆర్ఎ) అధ్యక్షులు కె.గురుమూర్తి, కార్యదర్శి ఎ.జగన్మోహన్, గౌరవాధ్యక్షులు బి.సూర్యనారాయణ తెలిపారు.ఎన్‌పిఆర్ శ్రామిక భవన్ సిఐటియు కార్యాలయంలో శనివారం విఆర్ఎల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా విఆర్ఎలకు జీతం పెంచకుండా పాలక ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నామిని విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని, అర్హులైన వారికి నాలుగో తరగతి ఉద్యోగులుగా ప్రమోషన్లు ఇవ్వాలని, జాబ్‌చార్టులో లేని పనుల నుంచి విఆర్ఎలను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు రమణ, చందర్రావు, అప్పారావు, దాలయ్య పాల్గొన్నారు.

వేపాడ పిఎసిఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ



వేపాడ పిఎసిఎస్ చైర్మన్‌గా గొంప కృష్ణ నియమితులయ్యారు. డైరెక్టర్లుగా మంచిన అప్పలసూరి, జి.దేవుడునాయుడు ఎంపికయ్యారు. గొంప కృష్ణ ప్రస్తుతం డిసిఎంఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. వీరి నియామకం పట్ల టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బకాయిల సాధనకు కృషి : డిపిఆర్‌టియు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక పరమైన బకాయిలు సాధించేందుకు కృషి చేస్తామని డిపిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీను అన్నారు. విజయనగరం యూత్ హాస్టల్ సమీపంలో గల ఎపిజిఇఎ సంఘ భవనంలో డిపిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు పువ్వల శ్రీనివాసరావు అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడం ఆనందకరమని అన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు, పని ఒత్తిడిపై ముఖ్యమంత్రిని, విద్యాశాఖా మంత్రిని కలసి వినతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కంది వెంకటరమణ, కృష్ణా జిల్లా అధ్యక్షులు పెరుమాళ్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు దామోదరరావు, మన్యం జిల్లా అధ్యక్షులు ఇ. శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా గౌరవాధ్యక్షులు నారాయణప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి దారుణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

దళిత యువకుడిపై వైసిపి నాయకులు దాడి చేయడం దారుణమని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న ఖండించారు. శనివారం దళిత నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో దళిత యువకుడు పవన్‌పై వైసిపి నేత భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దినేష్ రెడ్డి, అనిల్ రెడ్డి దారుణంగా దాడి చేశారన్నారు. ముఖ్యంగా వైసిపి నేతలు కులహంకారం చూపించి దళితులపై ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే అధికారం కోల్పోయిన వైసిపి నాయకులు జీర్ణించుకోలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని, వారి దాడులను ఎదుర్కొని గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దాడి చేసిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కింతాడ కళావతి, పొడుగు కృష్ణవేణి, దన్నాన గోవింద, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలిగితే మంచి భవిష్యత్

ప్రజాశక్తి-బొబ్బిలి

సత్ప్రవర్తనతో మెలిగితేనే మంచి భవిష్యత్ ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక సబ్ జైలును శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తెలిసీ తెలియక చేసిన తప్పులను తెలుసుకుని భవిష్యత్తులో మరల తప్పులు చేయకుండా సత్ప్రవర్తనతో ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. రిమాండ్ ఖైదీలకు నాణ్యమైన భోజనం పెట్టాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. వంట గది, ఖైదీల బ్యారక్‌లను, శానిటేషన్ పరిశీలించారు. ఆయనతో న్యాయవాది ప్రసన్నకుమార్, సిబ్బంది ఉన్నారు.

కూల్ డ్రింక్స్ వద్దు.. ఆరోగ్యమే ముద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆరోగ్యానికి హాని కలిగించే కూల్ డ్రింక్స్‌ను విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ముద్దని జనవిజ్ఞాన వేదిక జాతీయ విద్యా కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎవి రాజశేఖర్ అన్నారు. జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో శనివారం క్విట్ కూల్ డ్రింక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కూల్ డ్రింక్స్‌లో కార్బన్ డయాక్సైడ్, ఆల్కహాల్, ఎరువులు తదితర ప్రమాదకరమైన పదార్థాలు కలుపుతారని, ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో హాని కలిగిస్తాయని చెప్పారు. జెవివి జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ కోకో కోల, పెప్సీ వంటి విదేశీ కూల్ డ్రింక్స్ ను విడిచిపెట్టి మన ఆరోగ్యాన్ని, దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కోశాధికారి షిణగం శివాజీ, గురజాడ పాఠశాల హెచ్‌ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కళాసీల విశ్రాంతి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ కళాసీల విశ్రాంతి భవనం నిర్మాణానికి యుద్ధ స్తంభం సమీపంలో ఎమ్మెల్యే బేబినాయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాసీల విశ్రాంతి కోసం నూతన భవనానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కళాసీ సంఘం కార్యదర్శి వర్మ, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, జగన్నాథపురం సర్పంచ్ బి.పద్మ, వైసిపి నాయకులు బి.సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ బి.తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల లెక్కలు తేల్చాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఆలయాలకు ప్రజలు, దాతలు ఇచ్చే విరాళాల వివరాలను తెలియజేయాలని పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఎం.ఎస్.వర్మ డిమాండ్ చేశారు. ఇదే విషయమై శనివారం పట్టణంలోని దేవికూడలిలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శృంగవరపుకోటలోని ఉత్సవాలు, పండగల పేరుతో ప్రతి ఏటా బలవంతంగా చందాలు, విరాళాల పేరుతో డబ్బులు వసూలు చేసి, లెక్కలు చెప్పకుండా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చందాల పేరుతో ఎవరైనా బెదిరిస్తే 100కు డయల్ చేయాలని సూచించారు.

ఉత్సాహంగా యోగా పోటీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు 35 మంది ఎంపిక



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు తోటపాలెంలోని గాయత్రి స్కూలులో శనివారం ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో సుమారు 100 మంది యోగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వివిధ విభాగాల్లో 35 మంది క్రీడాకారులను వచ్చేనెల 5,6,7 తేదీలలో తాడేపల్లిగూడెంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు అవనాపు విక్రమ్ , అల్లు నరేంద్ర, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సి.ఎచ్ వేణుగోపాలరావు, యోగ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. సన్యాసిరావు, ఎస్. రవి వర్మ, ఎన్. పైడిరాజు, ఎం. గౌతమి, జి. సంధ్య యోగా శిక్షకుల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

శృంగవరపుకోట : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శృంగవరపుకోట క్రీడాకారులు ఎంపికయ్యారు. విజయనగరంలోని గాయత్రి టెక్నో స్కూల్‌లో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఎ.ప్రభాష్ (18-21 ఏళ్ల విభాగం), కొమ్మొజు సంతోషి దేవి (30-35ఏళ్ల విభాగం), వై.విజయలక్ష్మి (40-45 ఏళ్ల విభాగం), బి.రామకృష్ణ (45ఏళ్ల పైబడి) ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో బొబ్బిలి లాస్యశ్రీ, హృషీకేశ్, రేపాక లాస్యశ్రీ పాల్గొన్నారు. వీరిని యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు అవనాపు విక్రమ్, కార్యదర్శి వేణు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.సన్యాసిరావు అభినందించారు.

సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజుఅన్నారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నగరంలోని 20, 22, 23 డివిజన్లలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం బొడ్డువారి జంక్షన్ లో సమావేశం నిర్వహించారు. అనంతరం విజయనగరం మండలం సారిక, గుండాలపేట గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, సారిక సర్పంచ్ బొబ్బాది ఈశ్వరరావు, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గంగ్రెడ్డి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పొలి నాయుడు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జొన్నవలస ఎంపిటిసి సభ్యులు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, గంటా రవి, పాశి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగు కార్యక్రమంపై సమీక్ష

నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంపై ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి తన కార్యాలయంలో సమీక్షించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించడం , టిడిపి యాప్ లో అప్‌లోడ్ చేస్తున్న వివరాల ప్రగతిపైక్లస్టర్ ఇంఛార్జిలతో చర్చించారు. ప్రజలతో మమేకమవుతూ సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే అదితి

ఐడిబిఐ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

ప్రజాశక్తి-బొబ్బిలి



మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఐడిబిఐ ఉద్యోగులు ఈ నెల 11న చేపట్టనున్న సమ్మెకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు నాయకులు బి.యుగంధర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడాల్సిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. ఐడిబిఐలో వాటాలను ప్రయివేట్ ఇన్వెస్టర్లకు అమ్మకానికి మోడీ ప్రభుత్వం పెట్టిందని విమర్శించారు. ప్రధాని మోడీ ఆత్మనిర్బర్ భారత్ ఇదేనా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం బ్యాంకుల్లో సుమారు రూ.3 లక్షల కోట్లు డిపాజిట్లు ఉన్నాయని, బ్యాంకును ప్రయివేటు ఇన్వెస్టరుకు విక్రయిస్తే ప్రజలు డబ్బులు వారి చేతుల్లోకి వెళ్తాయని చెప్పారు. గత మూడేళ్లలో ఐడిబిఐ సుమారు 30 వేల కోట్లు ఆపరేటింగ్ లాభం సంపాదించిందని, ఇటువంటి భారీ లాభాలను ప్రయివేటు ఇన్వెస్టర్లు కాజేస్తారని తెలిపారు. ప్రయివేటు బ్యాంకులు, విదేశీ బ్యాంకుల చరిత్ర అందరికీ తెలిసిందేనని, హర్షద్ మెహతా కుంభకోణం మొదలుకొని ఇంతవరకు దేశంలో బయటపడ్డ అన్ని కుంభకోణాల్లో ప్రయివేటు బ్యాంకుల పాత్ర ఉందని చెప్పారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు.

సామాజిక రుగ్మతలపై జెవివి పోరు

జిల్లా అధ్యక్షులు వెంకటరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్



కవిగాయక సమ్మేళనంలో మాట్లాడుతున్న కవి గొర్లె ఆదినారాయణ

సామాజిక రుగ్మతలపై జ్ఞన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం గురజాడ గ్రంథాలయంలో కవి గాయని సమ్మేళనం కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు చీకటి దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక అనేది మూఢ నమ్మకాలపైనే కాకుండా సామాజిక రుగ్మతలపై కూడా పనిచేస్తుందని తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళాభివృద్ధి అనే అంశాలపై నిత్యం ప్రజలను చైతన్యవంతం చేస్తుందన్నారు. ప్రపంచంలో 194 దేశాలు ఉండగా మానవ అభివృద్ధిలో మన భారతదేశం 130వ స్థానంలో ఉందనన్నారు. సైన్సు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య, వైద్య రంగాల్లో దోపిడి జరుగుతుందని, ఔషధాలు పెత్తనం చెలాయిస్తున్నాయని తెలిపారు. వచ్చేనెల 13,14 తేదీల్లో విజయనగరంలో జరుగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కవులు, రచయితల పలు అంశాలపై తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణ ప్రభాత్, కె.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్ రావు తదితరులు పాల్గొన్నారు

వైఎస్ సునీతకు న్యాయం చేయాలి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఆరేళ్లఅయినా తమ కుటుంబానికి న్యాయం జరగలేదని ఆవేదన చెందుతున్న వైఎస్ సునీతరెడ్డికి న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు, శనివారం లోక్‌సత్తా జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రిని హత్య చేసిన వారు, దానికి సహకరించిన వారు రాజకీయాల నీడలో పబ్లిక్ గా తిరుగుతుంటే ఎవ్వరూ ఏమి చెయ్యలేని పరిస్థితి నెలకొందని ఆమె ఆందోళన చెందుతున్నారని అన్నారు. హైకోర్టులో 6 కేసులు, సుప్రీంకోర్టు లో 6 కేసులు ఉన్నాయని, ఎవరు హత్య చేశారో, దానికి ఎవరు సహకరించారో,ఎవరు తమ కుటుంబాన్ని ఎలా తప్పుత్రోవ పట్టించారో వివరాలతో ప్రాణాలకు తెగించి బయట పెడుతున్నా,పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ,కేంద్ర దర్యాప్తు సంస్థలు త్వరగతిన న్యాయం చేయకపోవడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా తగిన న్యాయం సునీత రెడ్డికి జరిగేలా చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా కుట్రలు ఛేదించడంలో విఫలం కావడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్టు ప్రజలు అభిప్రాయ పడుతున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని అన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

కెజిపూడిలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెజిపూడి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో పోలీసులు శనివారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. శృంగవరపుకోట రూరల్ సిఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్ఐ సురేంద్ర కుమార్ ఆధ్వర్యాన సిబ్బంది ప్రతి ఇంటినీ తనిఖీ చేశారు. నాటు తుపాకులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా గిరిజనులతో సిఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఏ ఒక్కరి వద్ద తుపాకులున్నా నేరుగా స్టేషన్‌కు అప్పగించాలని సూచించారు.

మానవత్వం చాటుకున్న బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి

బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన మానవత్వం చాటుకున్నారు. మండలంలోని ముగడ గ్రామంలో శనివారం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే బేబినాయన తన వాహనాన్ని ఘటనా స్థలం వద్ద ఆపారు. క్షతగాత్రులను బాడంగి ప్రభుత్వ ఆస్పత్రికి దగ్గరుండి తన వాహనంలో పంపించారు.



గాయపడిన వారిని కారులో ఎక్కిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఎమ్మెల్సీకి సురేష్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విజయవాడలో వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను ఎమ్మెల్సీ సురేష్‌బాబు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీపై దాడి చేయడం దారుణమన్నారు. వైసిపి ఎమ్మెల్సీపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.



రమేష్ యాదవ్‌ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సురేష్ బాబు

గొంతుకోసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలం జమ్మునారాయణ పురంలో గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు.. స్థానికుల కథనం ప్రకారం..భోగాపురానికి చెందిన గీత జమ్మునారాయణపురంలో నివాసం ఉంటోంది. ఆమె భర్త ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. తరువాత తన స్నేహితుడు భోగాపురానికి చెందిన కొమ్మూరు పార్వతీశ్వరరావు (అలియాస్ శ్రీధర్)తో కలసి జమ్ము నారాయణపురంలో నివాసముంటోంది. గీతను పార్వతీశ్వరావు పెళ్లి చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. గీత భర్త మృతి చెందిన తరువాత వచ్చిన డబ్బుల విషయమై గీత, పార్వతీశ్వరరావు మధ్య గొడవలు జరగడంతో కొద్దిరోజుల క్రితం పార్వతీ శ్వర రావు బయటకు వెళ్లి పోయాడు .శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి గీతను బెదిరిద్దామని బ్లేడ్ తో గొంతుకోసుకున్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో బ్యాటరీ చోరీ

ప్రజాశక్తి-సంతకవిటి

సంతకవిటి మండల కేంద్రంలో వరుస దొంగతనాలు జరుగుతునే ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని చాకలి వీధికి చెందిన పి.వంశీ ఆటోలో బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. రోజువారీలాగే శనివారం ఉదయం ఆటో ను పరిశీలించగా బ్యాటరీ లేకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సంతకవిటి మండల కేంద్రంలోని కొద్ది రోజుల్లోనే వైన్ షాప్, శ్రీను షాప్, ఆలయ హుండీ, ఆటోలో బ్యాటరీ వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కెఆర్‌పేటలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

కృష్ణరాయుడుపేటలో ఉచిత పశు ఆరోగ్య, గర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శనివారం నిర్వహించారు. 30 పశువులకు పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో పశువులు, జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెలిబోని ముసలి నాయుడు పాల్గొన్నారు.